క్లుప్తంగా

సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీ

దహెగాం: మండలంలోని ఆయా గ్రామాలకు చెందిన లబ్ధిదారులకు మంజూరైన సీఎంఆర్ ఎఫ్ చెక్కులను మంగళవారం ఎంపీడీవో కార్యాలయంలో మండల రైతుబంధు సమితి కన్వీనర్ సంతోష్‌గౌడ్ పంపిణీ చేశారు. నియోజకవర్గ పరిధిలోని చినగుడిపేట గ్రామానికి చెందిన వీరయ్యకు రూ.12,000, శంకర్‌కు రూ.95,000, గిరవెల్లి గ్రామానికి చెందిన సరోజనకు రూ.44.000, లగ్గాం గ్రామానికి చెందిన కల్యాణికి రూ. 16,000 చెక్కులు అందజేశారు. కార్యక్రమంలో వైస్‌ఎంపీపీ చౌదరి సురేశ్, నాయకులు పాల్గొన్నారు.

రోడ్డు మరమ్మతు చేపట్టాలి

తిర్యాణి: మండలంలోని పంగిడిమాదర నుంచి లింగాపూర్ మండల కేంద్రం వరకు ఉన్న రోడ్డుకు మరమ్మతులు చేపట్టాలని ఆదివాసీ సేన జిల్లా అధ్యక్షుడు కోట్నాక గణపతి డిమాండ్ చేశారు. మంగళవారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ పదేళ్ల క్రితం వేసిన రోడ్డు పూర్తిగా గుంతలమయంగా మారడంతో రాకపోకలు సాగించే ప్రయాణికులు, వాహనదారులు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. ప్రతీ నెల వైద్య పరీక్షల కోసం వెళ్లే గర్భిణులు నరకయాతన అనుభవిస్తున్నారని ఆరోపించారు. సమావేశంలో సంఘం మండల అధ్యక్షుడు మడావి వెంకట్‌రావు, ఆత్రం చిత్రు, కోట్నాక దస్రు, మారుతి, దేవు తదితరులు ఉన్నారు.

సరుకులు పంపిణీ

కెరమెరి: మండలంలోని నాగల్‌గొంది గ్రామానికి చెందిన సిడాం రాజు రెండు రోజుల క్రితం మృతి చెందగా మంగళవారం ఎస్సై గుంపుల విజయ్ బాధిత కుటుంబాన్ని పరామర్శించి తన ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. అనంతరం నెల రోజులకు సరిపడా నిత్యావసర సరుకులు అందజేశారు. అనంతరం ఇన్సూరెన్స్ వల్ల కలిగే లాభాలపై వివరించారు. సిడాం ధర్మూ, గ్రామస్తులు ఉన్నారు.

రాజస్థాన్ మహిళా మండలి ఆధ్వర్యంలో అన్నదానం

కాగజ్‌నగర్‌టౌన్: పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్ ఎదురుగా సిర్పూర్ ఎమ్మెల్యే కోనేరు కోనప్ప ఆధ్వర్యంలో కొనసాగుతున్న నిత్యాన్నదాన సత్రంలో మంగళవారం రాజస్థాన్ మహిళా మండలి ఆధ్వర్యంలో అన్నదానం నిర్వహించారు. శ్రావణమాసం చివరి సోమవారం దృష్టిలో పెట్టుకొని ఒక పూట కమిటీ ఆధ్వర్యంలో అన్నదానం చేశారు.

12న చేపట్టిన ధర్నా జయప్రదం చేయాలి

కాగజ్‌నగర్‌టౌన్: ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారం కోసం యూఎస్‌పీఎస్ ఆధ్వర్యంలో నిర్వహించే దశలవారీ పోరాట కార్యక్రమాలను జయప్రదం చేయాలని సంఘం జిల్లా కమిటీ ఉపాధ్యాయులకు పిలుపునిచ్చింది. మంగళవారం స్థానికంగా పోరాటానికి సంబంధించిన వాల్ పోస్టర్లను సంఘం రాష్ట్ర నాయకుడు మేడి చరణ్ దాస్ ఆధ్వర్యంలో ఆవిష్కరించారు. ఈ నెల 12న జిల్లా కేంద్రంలో కలెక్టరేట్ ఎదురుగా నిర్వహించ తలపెట్టిన ధర్నాను జయప్రదం చేయాలని కోరారు.

సకాలంలో రుణాలు చెల్లించాలి

కెరమెరి: తీసుకున్న రుణాలు సకాలంలో చెల్లించాలని తెలంగాణ గ్రామీణ బ్యాంకు మేనేజర్ శ్రీపాద్ అన్నారు. మంగళవారం మండలంలోని గౌరి గ్రామంలో మహిళా సంఘాలకు ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పాల్గొని ఆయన మాట్లాడారు. ఎఫ్‌వో కార్తిక్, ఐకేపీ సీసీ దస్తగిరి, వీవోఏ అంజనాబాయి ఉన్నారు.

సమగ్ర శిక్ష జాక్ కమిటీ ఎన్నిక

ఆసిఫాబాద్‌రూరల్: సమగ్ర శిక్ష అభియన్ జాక్ మండల కమిటీని మంగళవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండల అధ్యక్షుడు రమణ, ప్రధాన కార్యదర్శి సంతోశ్, ఉపాధ్యక్షుడు అనుప్ కుమార్, ట్రెజరీ నాగేశ్, సలహాదారుడు తిరుపతి, సభ్యులు నలంద, భాగ్యలక్ష్మి, స్వప్న, ప్రవళిక, సంతోష్, జయ, సోనాజీలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

సన్మానం

ఆసిఫాబాద్: ఇటీవల నూతనంగా ఎన్నికైన జిల్లా పద్మశాలీ సంఘం అధ్యక్షుడు ఇరుకుల్ల ఆంజనేయులును మంగళవారం జిల్లా కేంద్రంలోని మార్కండేయ కాలనీవాసులు ఆలయ ఆవరణలో శాలువాతో ఘనంగా సన్మానించారు. నాయకులు లింగయ్య, ధర్మయ్య, చందు, శ్రీకాంత్, శ్రీనివాస్, అంజయ్య, భద్రయ్య, రాంచందర్, మంగ, విజయ పాల్గొన్నారు.

జర్నలిస్టు కాలనీలో వసతులు కల్పించాలి

ఆసిఫాబాద్: జిల్లా కేంద్రంలోని మోడల్ స్కూల్ సమీపంలో గల జర్నలిస్టు కాలనీలో మౌలిక వసతులు కల్పించాలని జర్నలిస్టులు మంగళవారం కలెక్టర్ హేమంత్ బోర్కడేకు వినతిపత్రం సమర్పించారు. వారు మాట్లాడుతూ కాలనీలో విద్యుత్, సీసీ రోడ్లు, మురికి కాలువలు, మంచినీటి సరఫరా లేకపోవడంతో ఇళ్లు నిర్మించుకోలేక పోతున్నామన్నారు.

పేదలకు గృహయోగం

- మూడు విడుతల్లో నిధులు మంజూరు
- సొంత స్థలం ఉంటే రూ. 3లక్షలు
- ఈనెల 10 వరకు గడువు



కలెక్టరేట్‌లో దరఖాస్తు చేస్తున్న మహిళలు

ఆసిఫాబాద్‌రూరల్: నిరుపేదలకు గృహయోగం కలుగనుంది. సొంత స్థలం ఉండి ఇల్లు లేని పేదలకు సాయం చేసేందుకు ప్రభుత్వం గృహలక్ష్మి పథకానికి శ్రీకారం చుట్టింది. ఇందులో భాగంగా ఇంటి నిర్మాణానికి రూ.3 లక్షల ఆర్థిక సాయం చేయనుంది. ఈ సాయాన్ని రూ.లక్ష చొప్పున మూడు విడుతల్లో అందించనుంది. ఒక్కో నియోజకవర్గంలో 2500-3000 మందికి సాయం అందేలా మార్గదర్శకాలు రూపొందించింది. ఇళ్ల మంజూరు బిల్లుల చెల్లింపులు ఆన్‌లైన్‌లో జరిగేలా అధికారులు చర్యలు తీసుకోనున్నారు. కలెక్టర్ నేతృత్వంలో అమలయ్యే ఈ పథకంలో భాగంగా రెండు గదులు, టాయిలెట్‌తో ఇంటి నిర్మాణం చేపట్టాల్సి ఉంటుంది.

ప్రత్యేక కౌంటర్లు..

జిల్లా వ్యాప్తంగా ఎంపీడీవో, తహసీల్దార్ కార్యాలయాలతో పాటు కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన ప్రత్యేక గృహలక్ష్మి కౌంటర్లలో ఇళ్ల మంజూరుకు సంబంధించిన దరఖాస్తులు స్వీకరిస్తున్నారు. ఇళ్ల కోసం మహిళలు మాత్రమే దరఖాస్తు చేయాల్సి ఉంటుంది. ఆహార భద్రత కార్డు, బ్యాంక్ అకౌంట్, ఆధార్, ఆదాయం, నివాసం, రెండు పాస్ ఫొటోలతో దరఖాస్తు ఫాం నింపి ఇవ్వాలి. దరఖాస్తు గడువు ముగిసిన తరువాత ఈ నెల 20 వరకు క్షేత్రస్థాయిలో విచారణ చేపట్టి 25న లబ్ధిదారులను ఎంపిక చేయనున్నారు. లబ్ధిదారులు ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం రెండు గదులు ఉండేలా నచ్చిన డిజైన్‌లో ఇంటిని నిర్మించుకోవచ్చు. పథకం అమలు కోసం రాష్ట్ర గృహ నిర్మాణ సంస్థ ప్రత్యేక పోర్టల్ రూపొందించనుంది. ఇళ్ల మంజూరు, బిల్లుల చెల్లింపులు ఆన్‌లైన్‌లోనే జరిగిలా అధికారులు చర్యలు తీసుకుంటున్నారు.

ఈనెల 10 వరకు గడువు..

గృహలక్ష్మి పథకానికి దరఖాస్తు గడువు ఈ నెల 10వ రకు ఉండగా అర్హులు గృహలక్ష్మి కోసం ఎంపీడీవో కార్యాలయాలకు వెళ్లి దరఖాస్తులు చేసుకుంటున్నారు. గడువు తక్కువగా ఉండడంతో కార్యాలయాల వద్ద క్యూ కడుతున్నారు. ఇప్పటివరకు 1000కి పైగా దరఖాస్తులు వచ్చినట్లు అధికారులు తెలిపారు.

మంజూరు విధానం ఇలా..

ప్రతీ నియోజకవర్గంలో ఎస్సీలకు 20శాతం, ఎస్టీలకు10 , బీసీ మైనార్టీలకు 50శాతం ప్రాధాన్యం ఇవ్వనున్నారు. దరఖాస్తులు ఎక్కువగా వస్తే వెయిటింగ్ లిస్ట్ రూపొందించి తరువాత మంజూరైన ఇళ్లలో ప్రాధాన్యం కల్పిస్తారు. నిర్మాణ పురోగతిని బట్టి దశల వారీగా మూడు విడతల్లో నిధులు మంజూరు చేస్తారు. బేస్‌మెంట్ లెవల్‌కు రూ. లక్ష, రూఫ్ లెవల్‌కు రూ.లక్ష, నిర్మాణం పూర్తయ్యాక మిగిలిన రూ.లక్ష అందిస్తారు. ఎప్పటికప్పుడు నిర్మాణం పూర్తయిన ఫొటోలు అప్‌లోడ్ చేయాల్సి ఉంటుంది. నగదు జమ చేయడానికి లబ్ధిదారుడు ప్రత్యేక బ్యాంకు ఖాతా తెరవాలి.

అర్హతలు ఇవే..

- అర్హులు మహిళ పేరు మీద దరఖాస్తు చేసుకోవాలి. ఆహార భద్రత కార్డు ఉండాలి.
- సొంత స్థలంలో నివాసం ఉంటున్నట్లు ఆధార్ కార్డులో చూపాలి.
- ఆర్‌సీసీ ఉంటే అనర్హులవుతారు.
- దరఖాస్తుదారుడి కుటుంబసభ్యులు జీవో 59 ప్రకారం లబ్ధిపొంది ఉంటే అనర్హులు

అర్హులు దరఖాస్తు చేసుకోవాలి

కాగజ్‌నగర్‌టౌన్: గృహలక్ష్మి పథకం కింద అర్హులైన మహిళలు దరఖాస్తు చేసుకోవాలని మున్సిపల్ కమిషనర్ అంజయ్య విజ్ఞప్తి చేశారు. ఈ నెల 10 వరకు మహిళలు, వితంతువు మహిళలు మున్సిపల్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక కౌంటర్‌లో దరఖాస్తులు అందజేయాలన్నారు.

గడువు పొడిగించాలి..

గృహలక్ష్మి దరఖాస్తుల స్వీకరణ తేదీని పొడిగించాలని సీపీఎం నాయకుడు ఎం.ఆనంద్ డిమాండ్ చేశారు. 10వ తేదీ లోపు ఆదాయం, కులం సర్టిఫికెట్లు పొందడం కష్టంగా ఉందని, ఉన్నతాధికారులు గడువు పొడిగించాలని కోరారు.

పెంచికల్‌పేట్: నూతన ఇంటి నిర్మాణం కోసం గృహలక్ష్మి పథకానికి దరఖాస్తులు చేసుకోవాలని ప్రభుత్వం సూచించడంతో మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో మంగళవారం మహిళలు దరఖాస్తు చేసుకున్నారు. ఈనెల 10వ తేదీ వరకు ఎంపీడీవో కార్యాలయంలో దరఖాస్తులు స్వీకరించడానికి ప్రత్యేక కౌంటర్ ఏర్పాటు చేసినట్లు ఎంపీడీవో గంగాసింగ్ తెలిపారు.

జాతీయభావం పెంపొందించేలా వేడుకలు

- కలెక్టర్ హేమంత్ బోర్కడే
- స్వాతంత్ర్య దినోత్సవంపై అధికారులతో సన్నాహక సమావేశం



కలెక్టరేట్ ఆవరణలో పరిశీలిస్తున్న కలెక్టర్

ఆసిఫాబాద్: ప్రజలల్లో జాతీయభావం పెంపొందించేలా ఈ నెల 15న స్వాతంత్ర్య వేడుకలు నిర్వహించాలని కలెక్టర్ హేమంత్ బోర్కడే అన్నారు. జిల్లా కేంద్రంలోని సమీకృత కలెక్టరేట్‌లో అదనపు కలెక్టర్ దీపక్ తివారి, అదనపు ఎస్పీ అచ్చేశ్వర్‌రావుతో కలిసి మంగళవారం అన్ని శాఖల అధికారులతో సన్నాహక సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ వేడుకల్లో భాగంగా విద్యార్థులతో సాంస్కృతిక కార్యక్రమాలు ప్రదర్శించాలని, ప్రభుత్వ, సంక్షేమ అభివృద్ధి పథకాలతో ప్రగతి నివేదిక రూపొందించాలని ఆదేశించారు. పథకాల నిర్వహణ, విజయాలపై హోర్డింగులు, స్టాళ్లు ఏర్పాటు చేయాలన్నారు. వేడుకలకు వచ్చేవారికి అల్పాహారం, టీ, తాగునీరు ఇతర సదుపాయాలు కల్పించాలన్నారు. పోలీసు శాఖ ఆధ్వర్యంలో భద్రతా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. వేడుకల్లో ప్రోటోకాల్ పాటించేలా అవసరమైన ప్రణాళిక రూపొందించాలని సూచించారు. కార్యక్రమంలో ఆర్డీవో కదం సురేశ్, అధికారులు పాల్గొన్నారు.

గ్రామాల్లో కేంద్ర బృందం తనిఖీలు



గూడెంలో తనిఖీలు నిర్వహిస్తున్న కేంద్ర బృందం

చింతలమానెపల్లి: మండలంలోని గూడెం, ఖర్జెల్లి గ్రామాలలో మంగళవారం స్వచ్ఛ భారత్ మిషన్ కేంద్ర బృందం ఆధ్వర్యంలో తనిఖీలు నిర్వహించారు. ఆయా గ్రామాలలోని డంపింగ్ యార్డుల నిర్వహణ, కేంద్ర నిధులతో నిర్మించిన మరుగుదొడ్లు, ఇంకుడు గుంతలు, పారిశుధ్య పనులను బృందం సభ్యులు పరిశీలించారు. బృందం సభ్యులు రాజేశ్ గూడెం గ్రామ పంచాయితీలో, ప్రశాంత్ ఖర్జెల్లి గ్రామ పంచాయితీలో పరిశీలించగా మండల అధికారులు వీరికి వివరాలు తెలియజేశారు. తనిఖీల్లో భాగంగా గ్రామానికి వచ్చిన బృందం సభ్యులను, అధికారులను గ్రామస్తులు నిలదీశారు. మరుగుదొడ్లు, ఇంకుడు గుంతలు నిర్మించి సంవత్సరాలు గడుస్తున్నా బిల్లులు రాలేదని గూడెం గ్రామంలోని ఎస్సీ కాలనీవాసులు ఆరోపించారు. కాగా గ్రామాలలో తనిఖీలు నిర్వహించేందుకు వచ్చిన కేంద్ర బృందం సర్వే సభ్యులను తప్పుదోవ పట్టించడానికి మండల అధికారులు ప్రయత్నించినట్లు విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఆగమేఘాల మీద అసంపూర్తిగా ఉన్న కొన్ని పనులను పూర్తి చేసి సభ్యులను మభ్యపెట్టినట్లు పలువురు ఆరోపిస్తున్నారు. ఎంపీడీవో సత్యనారాయణ, స్వచ్ఛ భారత్ మిషన్ జిల్లా అధికారి ఫణికుమార్, ఎంపీవో సుధాకర్ రెడ్డి, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

కాగజ్‌నగర్‌రూరల్: మండలంలోని మోసం గ్రామ పంచాయతీలో మంగళవారం స్వచ్ఛ సర్వేక్షణ్ గ్రామీణ్ బృందం సభ్యులు పర్యటించారు. పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రాల్లో మరుగుదొడ్ల వినియోగంపై ఆరా తీశారు. గ్రామస్తులు పరిసరాల పరిశుభ్రత పాటిస్తున్నారా లేదా అని పరిశీలించారు. కార్యక్రమంలో బృందం జిల్లా కోఆర్డినేటర్లు కిషోర్, సునీల్, డీఆర్‌డీఏ ఏపీడీ కుటుంబరావు, ఇన్‌చార్జి ఎంపీడీవో గౌరీశంకర్, సర్పంచ్ పురుషోత్తం, ఉపసర్పంచ్ సంతోష్, గ్రామ కార్యదర్శి రాజేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

అర్హులందరికీ 'గృహలక్ష్మి' వర్తింపజేయాలి



మాట్లాడుతున్న ఆంజనేయులుగౌడ్

రెబ్బెన: జిల్లాలో అర్హులైన పేదలకు ప్రభుత్వం గృహలక్ష్మి ద్వారా ఇళ్లు మంజూరు చేయాలని బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి కేసరి ఆంజనేయులుగౌడ్ డిమాండ్ చేశారు. మంగళవారం గోలేటి టౌన్‌షిప్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో మాట్లాడుతూ పేదలకు డబుల్ బెడ్‌రూం ఇళ్లను కట్టిస్తామని చెప్పి అధికారంలోకి వచ్చిన బీఆర్‌ఎస్ ప్రభుత్వం గ్రామాల్లో ఇప్పటి వరకు ఒక్క ఇల్లు కూడా కట్టించలేదన్నారు. కేంద్ర ప్రభుత్వం ప్రధాన మంత్రి అవాస్ యోజన కింద 22 లక్షల ఇండ్లకు నిధులు మంజూరు చేసిందన్నారు. రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు కృష్ణకుమారి, జిల్లా ఉపాధ్యక్షుడు సునీల్ చౌదరి, గుల్బం చక్రపాణి, మండల ప్రధాన కార్యదర్శి నవీన్‌గౌడ్, ఉపాధ్యక్షుడు మహేందర్‌గౌడ్ పాల్గొన్నారు.

షరతులు లేకుండా రెగ్యులరైజ్ చేయాలి



పోస్టుకార్డులు పంపిస్తున్న సెకండ్ ఏఎన్‌ఎంలు

రెబ్బెన: సెకండ్ ఏఎన్‌ఎంలను ఎలాంటి షరతులు లేకుండా ప్రభుత్వం రెగ్యులరైజ్ చేయాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి బోగే ఉపేందర్ అన్నారు. మంగళవారం ఏఐటీయూసీ ఆధ్వర్యంలో సెకండ్ ఏఎన్‌ఎంలను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని డిమాండ్ చేస్తూ సీఎం కేసీఆర్‌కు ఉత్తరాలు పోస్ట్ చేశారు. ఆయన మాట్లాడుతూ 20 ఏళ్లుగా సెకండ్ ఏఎన్‌ఎంలు చాలీచాలని వేతనాలు తీసుకుంటున్నారన్నారు. ఈనెల 26న ఇచ్చిన నోటిఫికేషన్‌ను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. జిల్లా ప్రచార కార్యదర్శి ప్రమీల, ఏఎన్‌ఎంలు సునీత, వనిత, తులసీ, విజయలక్ష్మి, పద్మ తదితరులు పాల్గొన్నారు.

ఓటరు జాబితాపై అభ్యంతరాలు స్వీకరిస్తాం

కాగజ్‌నగర్‌టౌన్: ఓటరు జాబితాపై ఏమైనా అభ్యంతరాలు ఉంటే స్వీకరిస్తామని ఆర్డీవో రాజేశ్వర్ అన్నారు. మంగళవారం స్థానిక ఆర్డీవో కార్యాలయంలో సాధారణ అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఓటరు జాబితా తదితర అంశాలపై చర్చించారు. ఆర్డీవో కార్యాలయం ఏవో ప్రమోద్‌కుమార్, బీఆర్‌ఎస్, కాంగ్రెస్, బీజేపీ, బీఎస్పీ, ఎంఐఎం, టీడీపీ, సీపీఎం, సీపీఐ తదితర రాజకీయ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.

విశ్రాంత ఉద్యోగుల భవనంలో గద్దర్ సంతాప సభ



నివాళులర్పిస్తున్న నాయకులు

కాగజ్‌నగర్‌టౌన్: ప్రజాగాయకుడు గద్దర్ మృతికి సంతాపంగా మంగళవారం స్థానిక ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగుల సంక్షేమ సంఘం భవనంలో విశ్రాంత ఉద్యోగులు సంతాప సభ నిర్వహించారు. గద్దర్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో విశ్రాంత ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు జయదేవ్, పదాధికారులు సుభాష్, నారాయణ, నర్సయ్య, మహబూబ్, లింగయ్య, అన్వరుద్దీన్, మార్త సత్యనారాయణ పాల్గొన్నారు.

ఎస్సై ఉద్యోగం సాధించిన వెంకటేశ్‌కు సన్మానం



వెంకటేశ్‌ను సన్మానిస్తున్న రూరల్ ఎస్సై సోనియా

కాగజ్‌నగర్‌రూరల్: మండలంలోని కోసిని గ్రామానికి చెందిన ఆదె వెంకటేశ్ ఇటీవల ఎస్సైగా ఉద్యోగం సాధించడంతో మంగళవారం కాగజ్‌నగర్‌రూరల్ ఎస్సై సోనియా ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ రైతు కుటుంబం నుంచి ఎస్సైగా ఉద్యోగం సాధించడం హర్షనీయమన్నారు. కార్యక్రమంలో కోసిని సర్పంచ్ శ్రీనివాస్‌గౌడ్, బురదగూడ సర్పంచ్ పోశెట్టి, నాందేవ్ తదితరులు పాల్గొన్నారు.

108లో ప్రసవం



శిశువుతో 108 సిబ్బంది

కాగజ్‌నగర్‌రూరల్: మండలంలోని బారెగూడ గ్రామానికి చెందిన సునార్కర్ అనూష మంగళవారం 108 అంబులెన్స్‌లో ప్రసవించింది. పురిటి నొప్పులతో బాధపడుతున్న గర్భిణీని 108 అంబులెన్స్‌లో కాగజ్‌నగర్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో నొప్పులు ఎక్కువయ్యాయి. దీంతో అంబులెన్స్ పైలెట్ ఎస్‌కె ఖలీద్, ఈఎంటీ సాయికృష్ణ అంబులెన్స్‌లోనే డెలివరీ చేయగా మగ శిశువుకు జన్మనిచ్చింది. తల్లీ బిడ్డ ఇద్దరు క్షేమంగా ఉన్నారు.

అవగాహన సదస్సు

కాగజ్‌నగర్‌టౌన్: కాగజ్‌నగర్ పట్టణంలోని త్రిశూల్ పహాడ్, బస్టాండ్, ప్రభుత్వ డిగ్రీ కళాశాలల్లో మంగళవారం షీ టీం ఇన్‌చార్జి శ్రీనివాస్ ఆధ్వర్యంలో అవగాహన సదస్సు నిర్వహించారు.

వంటలమ్మలకు చీరెలు పంపిణీ

కాగజ్‌నగర్‌టౌన్: పట్టణంలోని బాలభారతి పాఠశాలలో వంటలమ్మలుగా సేవలు అందిస్తున్న వారికి సద్గురు శ్రీ మధుసూదన్ సాయి 44వ పుట్టినరోజు పురస్కరించుకొని సత్యసాయి అన్నపూర్ణ ట్రస్ట్ ఆధ్వర్యంలో చీరెలు పంపిణీ చేశారు.

'చలో హైదరాబాద్' జయప్రదం చేయండి

బెజ్జూర్: సీపీఎస్ విధానాన్ని రద్దు చేయాలనే డిమాండ్ చేస్తూ టీఎస్‌సీపీఎస్‌ఈయూ ఆధ్వర్యంలో ఈనెల 12న తలపెట్టిన చలో హైదరాబాద్ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని సంఘం మండల బాధ్యుడు దుర్గం రాజ్ కుమార్ కోరారు. మంగళవారం మండల కేంద్రంలో జరిగిన ఎఫ్‌ఎల్‌ఎన్ శిక్షణ కార్యక్రమం అనంతరం సంఘం సభ్యులతో కలిసి వాల్‌పోస్టర్ ఆవిష్కరించారు.

గాలికుంటు నివారణ టీకాలు వేయించాలి

కౌటాల: పశు సంపదను పెంచి పశు పోషకులు ఆర్థికంగా వృద్ధి చెందాలని పశువైద్యాధికారి శ్రీకాంత్ అన్నారు. మంగళవారం మండలంలోని మొగడ్‌దగడ్ గ్రామంలో పశువులకు గాలికుంటు వ్యాధి నిరోధక టీకాలు వేశారు. సర్పంచ్ ఉర్వత్ జీజాబాయి, సిబ్బంది సందీప్, రాజన్న, ప్రకాశ్, భిక్షపతి, శోభన్ రైతులు పాల్గొన్నారు.

సర్పంచ్‌గా బాధ్యతలు స్వీకరించిన అన్సార్ హుస్సేన్

బెజ్జూర్: బెజ్జూర్ గ్రామ పంచాయతీ సర్పంచ్‌గా మంగళవారం అన్సార్ హుస్సేన్ బాధ్యతలు స్వీకరించారు. కొద్ది రోజుల క్రితం సస్పెండైన ఆయన హైకోర్టు, కలెక్టర్ ఉత్తర్వుల మేరకు మరోమారు సర్పంచ్‌గా బాధ్యతలు చేపట్టారు. పాలకవర్గ సభ్యులు ఆయనను శాలువాతో సన్మానించారు.

రాష్ట్రస్థాయి సమావేశానికి హాజరు

ఆసిఫాబాద్: మహబూబ్‌నగర్‌లో జరిగిన రాష్ట్రస్థాయి జనరల్ బాడీ సమావేశానికి జిల్లా నెట్‌బాల్ అధ్యక్షుడు అలిబిన్ అహ్మద్, జిల్లా సెక్రెటరీ తిరుపతి, కోశాధికారి హరీశ్ హాజరయ్యారు. ఈ సందర్భంగా రాష్ట్ర అధ్యక్షుడు విక్రమాదిత్య రెడ్డి, కార్యదర్శి ఖాజీఖాన్‌లను సన్మానించారు.

ప్రజారోగ్యంపై ప్రత్యేక దృష్టి



అంబులెన్స్ ప్రారంభిస్తున్న డాక్టర్ అవినాష్

బెజ్జూర్: ప్రజారోగ్యంపై సీఎం కేసీఆర్ ప్రత్యేక దృష్టి సారిస్తున్నారని డాక్టర్ అవినాష్ అన్నారు. మండల కేంద్రంలోని సామాజిక ఆరోగ్య కేంద్రంలో మంగళవారం నూతన అమ్మ ఒడి (102) అంబులెన్స్‌ను ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ గర్భిణుల కోసం ప్రవేశపెట్టిన అమ్మఒడి 102 అంబులెన్స్ 24 గంటలు అందుబాటులో ఉంటుందన్నారు. ఎల్టీ దిలీప్, సిబ్బంది ఆయేషా, స్వరూప తదితరులు పాల్గొన్నారు.

చదువులో మరింత మెరుగుపడాలి



విద్యార్థితో చదివిస్తున్న అదనపు కలెక్టర్ దీపక్ తివారి

కెరమెరి(ఆసిఫాబాద్): చదువులో విద్యార్థులు మరింత మెరుగుపడేలా ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ చూపాలని అదనపు కలెక్టర్ దీపక్ తివారి అన్నారు. కెరమెరి మండలం ఝరి ప్రాథమికోన్నత పాఠశాలను మంగళవారం సందర్శించారు. ఈ సందర్భంగా పలువురు విద్యార్థులతో తెలుగు, ఇంగ్లిష్ పాఠ్యాంశాలు చదివించారు. అనంతరం పాఠశాలలో కొనసాగుతున్న మన ఊరు- మన బడి కార్యక్రమం పనులను పరిశీలించారు. పెండింగ్ పనులు త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. చదువులో వెనుకబడిన విద్యార్థులపై దృష్టి సారించాలని సూచించారు. గ్రామాల్లో పరిశుభ్రత పాటించాలని అదనపు కలెక్టర్ దీపక్ తివారి అన్నారు. మండలంలోని కొఠారి, మోడి, ఝరి, గొండ్‌గూడ పంచాయతీల్లో పర్యటించారు. పంచాయతీ కార్యాలయంలో రికార్డులతోపాటు గ్రామాల్లో కొనసాగుతున్న అభివృద్ధి పనులను పరిశీలించారు. ఆయన వెంట ఎంపీడీవో మహేందర్, ఎంపీవో సుదర్శన్, ఎంపీపీ మోతీరాం, సర్పంచ్ న్యానేశ్వర్, హెచ్‌ఎం సత్యనారాయణ తదితరులు ఉన్నారు.

పఠనా సామర్థ్యాలు పెంపొందించాలి



కెరమెరిలో మాట్లాడుతున్న డీఈవో అశోక్

కెరమెరి: విద్యార్థుల్లో పఠనా సామర్థ్యాలు పెంపొందించాలని డీఈవో అశోక్ అన్నారు. మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఆరు రోజులుగా కొనసాగుతున్న ఎఫ్‌ఎల్‌ఎన్ శిక్షణ ముగింపు కార్యక్రమానికి మంగళవారం హాజరయ్యారు. డీఈవో మాట్లాడుతూ పఠనా సామర్థ్యాల్లో రాష్ట్రంలోనే జిల్లా వెనుబడి ఉన్నట్లు సర్వేలో వెల్లడైందని, రానున్న కాలంలో ప్రగతి సాధించేందుకు కృషి చేయాలన్నారు. మండల నోడల్ అధికారి ప్రకాశ్, కోర్స్ డైరెక్టర్ భరత్‌రావు, ఆర్పీలు శ్రీధర్, ప్రత్యూష పాల్గొన్నారు.

తిర్యాణి: విద్యార్థుల్లో కనీస అభ్యాసన సామర్థ్యాలు పెంపొందించాలని ఎఫ్‌ఎల్‌ఎన్ నోడల్ అధికారి సెద్మకి రాము అన్నారు. మంగళవారం ఉపాధ్యాయులకు ఎఫ్‌ఎల్‌ఎన్ శిక్షణ తరగతులు ముగింపు సందర్భంగా నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రిసోర్స్ పర్సన్‌లు ప్రశాంత్ కుమార్, సునీల్ కుమార్, భరత్‌చంద్ర యాదవ్, రజినీకాంత్ ఉన్నారు.

కౌటాల: ప్రభుత్వ పాఠశాలల్లో తొలిమెట్టు కార్యక్రమాన్ని పకడ్బందీగా అమలు చేయాలని తొలిమెట్టు మండల అధికారి గావుడే హన్మంతు అన్నారు. కౌటాల జెడ్పీ ఉన్నత పాఠశాలలో చేపట్టిన మండల స్థాయి తొలిమెట్టు శిక్షణ తరగతులు మంగళవారం ముగిశాయి. హెచ్‌ఎం శ్యాంరావు, ఆర్పీలు విజయ్‌కుమార్, నాగేష్‌కుమార్, ప్రశాంత్, జ్ఞానేశ్వర్, స్వాతిగౌడ్, సీఆర్పీ రవికుమార్ పాల్గొన్నారు.

రైతులు యాజమాన్య పద్ధతులు పాటించాలి

బెజ్జూర్: పత్తి పంటలో రైతులు యాజమాన్య పద్ధతులు పాటించాలని ఏడీఏ రాజుల నాయుడు అన్నారు. మంగళవారం మండలంలోని మర్థిడి గ్రామశివారులో పత్తి పంటలను పరిశీలించారు. ప్రస్తుతం తీసుకోవాల్సిన యాజమాన్య పద్ధతులపై రైతులకు అవగాహన కల్పించారు. ఆయన వెంట ఏఈవో మారుతి, రైతులు ఉన్నారు.

చట్టాలపై అవగాహన ఉండాలి

ఆసిఫాబాద్‌రూరల్: ప్రతీ విద్యార్థి చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని సీనియర్ సివిల్ జడ్జి యువరాజ అన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని గిరిజన బాలుర వసతి గృహంలో న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించి చట్టాలపై అవగాహన కల్పించారు. జడ్జి మాట్లాడుతూ విద్యార్థుల రక్షణ కోసం అనేక చట్టాలు ఉన్నాయన్నారు. ఉచిత న్యాయ సేవలు లభించేలా కోర్టులో ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. డీఎల్‌ఎస్‌ఏ న్యాయవాది నరహరి, లీగల్ అసిస్టెంట్ అంజనదేవి, న్యాయవాది లాల్‌శావ్, ప్రిన్సిపాల్ సురేశ్ పాల్గొన్నారు.

రెండు రోజులుగా ఉపాధ్యాయుడి గైర్హాజరు

సిర్పూర్(టి): మండలంలోని మేడిపెల్లి గ్రామంలో ఐటీడీఏ ప్రైమరీ స్కూల్ రెండు రోజులుగా తాళం వేసి ఉండడంతో విద్యార్థులు నష్టపోతున్నారు. మంగళవారం గ్రామస్తులు పాఠశాలను సందర్శించి ఉపాధ్యాయుని పనితీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. విద్యార్థులు పాఠశాలకు వచ్చి తిరిగి వెళ్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పాఠశాలకు తాళం వేసి విద్యార్థులు హాజరవుతున్నట్లు ఉపాధ్యాయుడు ఆన్‌లైన్‌లో హాజరు పంపించాడని ఆరోపిస్తున్నారు.